# మాయ

**- తోలేటి జగన్మోహనరావు**



రాత్రిపదిగంటలయ్యింది. కరెంటు పోయి అంతా వెన్నెలగానే ఉన్నా చూరుకింద మాత్రం చీకటిగా ఉంది. అరుగు మీద శాలువా కప్పుకుని, పడక కుర్చీలో పడుకొని చుట్ట గుప్పుతున్న అప్పాజీ మొహం అగుపించడం లేదు కాని చుట్ట నిప్పు మాత్రం డేంజరు లైటులా వెలుగుతూ కనిపిస్తోంది.

'ఎలా ఉంది కేంపేను?'

అప్పాజీ అడిగాడు.

అరుగు ఎదురుగా కొబ్బరాకుల పందిరి కింద పది, పదిహేను మంది బల్లల మీద, కుర్చీల మీద కూర్చుని ఎన్నికల గురించి చర్చిస్తున్నారు. పలచగా వేసిన కొబ్బరాకుల లోంచి వెన్నెల పొడలు, పొడలుగా వాళ్ల మీద పడి, వాళ్లు వెదురు పొదల్లో మాటువేసిన పులుల్లా కనిపిస్తున్నారు. పందిరి కింద పులులకి జరుగుతున్న ఎన్నికలలో ప్రత్యక్ష ప్రమేయం ఏవీలేదు కాని రాజకీయాలు క్లోజుగా ఫాలో అవుతూ, కురువృద్ధులు అప్పాజీ గురుత్వం కింద వేట నేర్చుకుంటున్న ఎప్రెంటీస్ పులులు.

''తద్దినలాం ఉంది - ఓ వాలుపోస్టరు లేదు - ఓ కటౌట్ లేదు - ఓ ఊరేగింపు లేదు - ఉన్నా శవం ఎనకాల పదిమంది ఏడ్చినట్లు, కేండిడేట్ ఎనకాల ఓ వందమంది - ఛ...ఛ... ఇంక జనాల్ని చూస్తే, 'ఆడూ ఎదవే, ఈడూ ఎదవే - ఏ ఎదవకి ఓటెయ్యమంటవురా ఎదవా' అంటున్నారు...''

ఆ మాట చెవిని పడగానే భూకంపం వచ్చినట్లు, అరుగు మీద డేంజరు లైటు పైకీ కిందకూ ఊగి, ఊగి; కిందికి జారింది. జలుబు చేసిన ముసలి గొర్రె దగ్గినట్లు ఆగకుండా దగ్గు వినిపించింది.

'అప్పాజీ - చలిగా వుంది - లోపలికి పదండి - దగ్గొస్తున్నది'

'దగ్గు కాదు - నవ్వు' - అప్పాజీ తేరుకుని అన్నాడు - 'కేంపేను అంటుంటే చిన సూరీడు, పెద సూరీడు గుర్తుకొచ్చి నవ్వొచ్చింది - అదీ ఎలక్షనంటే.... అసలు ఎలెక్షన్లలో ఎంత టేలెంటు కనిపిస్తాది? రికార్డింగు డాన్సులో హీరో హీరోయిన్ల లాంటి కేండిడేట్లు, ఆళ్ళ వగలూ... వయ్యారాలు, ఓటర్లని ఆకర్షించడానికి ఆళ్ళు వేసే వేషాలు... చిన సూరీడు, పెద సూరీడు గురించి ఇన్లేదేంటి? మీరంతా అప్పటికి కుర్రాళ్ళు కాబోలు... గుడిలో లింగాన్ని మింగేవాడొకడు, గుడినే మింగేవాడొకడు - అల్లిద్దర్నీ మింగేసినోడు జేజిగాడి మనవడు...' - అప్పాజీ పగలబడి నవ్వాడు.

'ఆళ్ళెవరూ?'

'చిన సూరీడు, పెద సూరీడు అన్నదమ్ములే... పింతల్లి, పెత్తల్లి బిడ్డలు...' - అప్పాజీ మొదలుపెట్టాడు - '... ఒక వరలో రెండు కత్తులిమడనట్లే, ఒక పార్టీలో ఇద్దరు చీఫ్ మినిస్ట్రు కేండిడేట్లుండలేరు. అందుకని చినసూరీడు సగం మంది ఎమ్మెల్యేలని తీసుకొని, విడిపోయి, కొత్తపార్టీ పెట్టాడు. గవర్నమెంటు పడిపోయి, మధ్యంతర ఎన్నికలొచ్చేశాయి. అటూ ఇటూ హేమాహేమీగా పోరు మొదలైంది. సారా బ్లాక్‌మనీలా ప్రవహించింది.

నిన్నటిదాకా ఒక పేడకడిలోనే ఉన్నోళ్ళకి అయిడియాలజీ డిఫరెంసులేవుంటాయి? అంచేత పెర్సనలు లెవెల్లోనే మొదలయింది ఆళ్ళ కేంపేను.

'మా సిన్నోడికి సెడ్డీ కట్టడం నేర్పింది నేను. ఆడి చెయ్యి పట్టుకుని పాలిటిక్సులో ఓనమాలు దిద్దించింది నేను. ఇప్పుడు ఆడు శ్రీరామచంద్రుల వారి మీదకి ఆంజనీయులు యుద్ధానికి దిగినట్లు నా మీదే యుద్ధానికి దిగాడు. ఆడి తోక కత్తిరించేస్తాను' - అనేవోడు పెద్దోడు.


'నా తోక కత్తిరించడం ఆడి తరం కాదు - ఇటలాచార్ర గాడి పిచ్చర్లో కాంతారావు గాడిలా నేను ఆడికి అందకుండా ఆకాశంలోకి ఎగిరిపోతాను. అలాంటి వైరు వర్క్ మనది - ఆడు నా తోక కత్తిరించడం కాదు - ఆడి కోరలు నేనే పీకేస్తాను...' అనేవోడు సిన్నోడు.

సిన్నోడికి మేపు చూడ్డం వచ్చుకాని గ్లోబు చూడ్డం రాదు. ఆడు తెల్లబోయి 'ఏంటిది?' అన్నాడు.
'గ్లోబు'
'గ్లోబేంటి?'
'బూవి సున్నుండులా గుండ్రంగా ఉంటుందిరా సిన్నోడా'
'బూవి నిన్నరాత్రి పూతరేకు సుట్టలా వుంది... ఇలా లేదు' అన్నాడు సిన్నోడు.

శుక్రవారం పెద్దోడు షేర్వాణీ వేసుకుని మసీదు దగ్గర ముస్లిం ఓట్లడిగితే ఆదివారం సిన్నోడు ఫాదిరీ ఏషం ఏసి చర్చి దగ్గర ఓట్లడిగేవోడు. ఆడు చిరిగిన బనీను, నిక్కరూ ఏసుకుని మురికివాడల్లో తిరిగితే, ఈడు గోచీ ఎట్టుకుని శనివారం సంతలో కూచునేవాడు. ఆడు జోతిలక్ష్మి డాన్సు పెడితే, ఈడు జయమాలిని డాన్సు పెట్టేవోడు. ఈళ్ళ ఏషాలు చూడ్డానికి జనం ఇరగబడి వచ్చేవారు. ఆ నెలరోజులూ సినిమా హాళ్ళు కలెక్షన్లు పడిపోయాయి. రికార్డింగు డాన్సులోళ్లూ, బోగం మేళం వోళ్ళు బిజినెస్ లేక గొల్లుమన్నారు.

'.... సిన్నప్పుడు మా పిన్ని సున్నుండలూ, పూతరేకు సుట్టలూ వంటింట్లో దాస్తే ఈడు ఎలా పసిగట్టేవోడో - కుక్కలా వాసన పట్టేసేవోడు...' - పెద్దోడు చెప్పేవోడు - '...స్కూలు నుంచి వచ్చీ రాగానే - ఒరే పెద్దోడా - అట్నుంచి మూడో డబ్బాలో సున్నుండలున్నాయిరా - ఇట్నుంచి ఏడో డబ్బాలో పూతరేక సుట్టలున్నాయిరా, అని నాచేత తీయించేవోడు - ఆడికి డబ్బాలు అందేయి కావు - ఆడు అప్పుడూ, ఇప్పుడూ మూడడుగులే.

రేపు ఈ మూడడుగుల చీఫ్ మినిస్ట్రు ఏమంటాడు? ఒరే సెక్రెట్రీ డబ్బు వాసనేస్తోంది అట్నుంచి మూడో ఫైలందుకోరా



బొమ్మలు: అన్వర్

- ఇట్నుంచి ఏడో ఫైలందుకోరా - ఏలిముద్ర కొట్టేస్తా...' అంటూ హిరణ్యకశిపుడి తమ్ముళ్ళా దేశాన్ని పూతరేకు సుట్టలా సుట్టి తినేస్తాడు. మరి ఆడికి ఓటేస్తారో, ఆడి గురువుని నాకు ఓటేస్తారో డిసైడు చేసుకోండని ప్రార్థిస్తున్నా...'

'నేను ఏలిముద్ర గాణ్ణని మా పెద్దోడు సెబుతున్నాడట. ఆడి కంటె రెండాకులు తక్కువ - మూడోక్లాసు దాకా సదివినా - తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ సంతకం చెయ్యగలను - సున్నుండలూ, పూతరేకులూ అంటూ పెర్సనలుగా మాట్లాడ్డం ఆడి లెవెలు...' - అన్నాడు ముఖం మాడ్చుకుని.

'ఆడిలాగే నాకూ పెర్సనలంటే ఇష్టంలేదు. సున్నుండలు కాకుండా పాలిటిక్సు అడుగుదారంటే ఆడికి వరల్డు మేపులో ఇండియా ఎక్కడుంటాదో తెలీదు... ఆడు వరల్డు మేపులో ఇండియా కరెక్టుగా సూపిస్తే నేను గుండు గొరిగించుకుని సన్నాసుల్లో కలసిపోతా... ఛాలెంజ్...' అన్నాడు పెద్దోడు.

మర్నాడు ఆదే ప్లేసులో సిన్నోడు మీటింగు పెట్టి - 'నేను మేపులో ఇండియా సూపిస్తే మా పెద్దోడు గుండు గొరిగించుకుంటానంటున్నాడట - అణ్ణి ఆ మాట మీద నిలబడమనండి - మంగలి సూరన్నగాడిని తీసుకొచ్చా - ఇదిగో - మేపులో ఇండియా ఎక్కడుందో సూపించేస్తున్నాను - మేపేదీ?' అనరిచాడు హుషారుగా.

రాత్రంతా ట్యూషనెట్టి మేపులో ఇండియా ఎక్కడుందో సూపించడం నేర్పారు సిన్నోడికి.

పెద్దోడు తక్కువ తిన్నాడా? ఆడికీ ట్రిక్కులు తెలివా? సిన్నోడు మేపని అరవగానే, పెద్దోడి మనుషులు బండి చక్రం సైజు గ్లోబు తీసుకొచ్చి 'ఇదిగో' అన్నారు.

సిన్నోడికి మేపు చూడ్డం వచ్చుకాని గ్లోబు చూడ్డం రాదు. ఆడు తెల్లబోయి 'ఏంటిది?' అన్నాడు.

'గ్లోబు'

'గ్లోబేంటి?'

'బూవి సున్నుండులా గుండ్రంగా ఉంటుందిరా సిన్నోడా'

'బూవి నిన్నరాత్రి పూతరేకు సుట్టలా వుంది... ఇలా లేదు' అన్నాడు సిన్నోడు.

గ్లోబు, మేపూ ఒకటవునా కాదా అని వివాదం వచ్చి ఓ రిటైర్డు ఐపియస్ ఆఫీసరుగార్ని సలహా అడిగారు సిన్నోడు, పెద్దోడు. ఈళ్ళ తగాదాల్లో తలదూర్చి రొకటిపోట్లు తినడానికి ఆడేవన్నా అల్లాటప్పావోడా? ఏది ఏమైనా తనకి లాభం ఉండేలా చూసుకునే ఐపీయస్సోడు ఆడు.

'బావుంది - నెగ్గేవాడెవడో తెలీకుండా, నిలుచున్న పళాన తీర్పు చెప్పమంటే ఎలా? నన్ను చెయిర్మన్ చేసి, ఒన్‌మేన్ కమిషనేసి, కార్లూ, బంగ్లా, స్టాపూ అన్నీ ఏర్పాటు చెయ్యండి - ఓసారి హాంకాంగు, అమెరికా తిరిగి, ఆపైన అవసరమైతే చంద్రమండలానికో ట్రిప్పేసి అక్కడ్నుంచి బూవి గుండ్రంగా వుందో లేదో సూడాలి....' అన్నాడాడు.

'పోనీ ఈ సారి మా సిన్నోడుని సాపమేపులోనే హైద్రబాదెక్కడుందో సూపించమనండి - ఆడు గనక కరెక్టుగా సూపిస్తే - ఇదిగో, మంగలి సూరన్న గాడిని నేనే తీసుకొచ్చాను - నేను గుండుకొట్టించుకొని సన్నాసుల్లో కల్సిపోతా' అని పెద్దోడు మళ్ళీ ఛాలెంజి చేశాడు, రెండ్రోజుల తర్వాత.

చిన్నోడు ఆ ఛాలెంజి అందుకుందామనుకున్నాడు కాని కొంచెం ఎక్సుపీరియన్సున్నోళ్ళు ఆడికి వద్దని సలహా ఇచ్చారు - 'ఆడు హైద్రాబాదంటన్నాడు కాని ఏ హైద్రాబాదో చెప్పడం లేదు - ఈడికి ట్యూషనెట్టి మన హైద్రబాదు చూపించడం నేర్పితే, ఆడు పాకిస్తాన్లో హైద్రాబాద్ అన్నానంటాడు. పోనీ అదీ చూపిస్తే ఇంకా ఏ దేశంలో ఏ హైద్రాబాదుందో ఎవడికి తెల్సు? సైలెంటుగా ఊరుకోడం బెటరు. ఆదీగాక, ఆడు గుండు గొరిగించుకుని సన్నాసుల్లో కల్సిపోతానంటున్నాడు కాని పాలిటిక్సు వదలతానంటంలేదు. అయినా ఆడు స్క్రీన్‌ప్లే రాస్తే మనవాడ్డం ఏంటి? మన స్క్రీన్‌ప్లే మనవే రాసుకోవాలి గాని...' అన్నారు.

ఇల్లా హేమాహేమీగా జరుగుతున్న కేంపేన్లో ఆటలో సత్రకాయలా కత్తెరమార్కు ఇండిపెండెంటున్నాడన్న సంగతి ఎవరికీ గుర్తులేదు. ఇంకా పోలింగు నలభై ఎనిమిది గంటలుందనగా ఆళ్ళిద్దరూ కేంపేను ఆపి కొంచెం ఊపిరి తీసుకుందావనుకుంటుంటే పెద సూరీడు కోటలో ఫోను మోగింది.

'హలో! ఎవరూ?' అన్నాడు హాల్లో కూర్చున్న వాళ్ళలో ఒకడు ఫోను అందుకుని.

'పెద సూరీణ్ణి పిలవండి' - అందీ ఓ కంఠం అర్జెంటుగా.

'ఎవరు?' అడిగారు కేంపేయిన్ మేనేజర్ గారు.

'అర్జంటుట - పెద సూరీడు గారితోనే మాట్లాడతాడంట.'

'ఇలా ఇయ్యి' అని ఫోనందుకుని, 'హలో - నేను కేంపేయిన్ మేనేజర్ని - ఏం కావాలి?' అన్నారు.

'చెంచాలతో నేను మాటాడను'

కేంపేయిన్ మేనేజర్ బూత్ కేప్చరింగ్, రయిడింగుల్లో రాటుదేలిన రకవేగాని, అవతల గొంతు అంత అథారిటీగా వినిపించేటప్పటికి తోక ముడిచి పెద సూరీడుకి ఫోనందించాడు, ఎందుకైనా మంచిదని.

'హల్లో....' అన్నాడు పెదసూరీడు.

'హలో....నేను కత్తెరగాణ్ణి... నేను చెప్పేది విను పెదబాబూ - నువ్వు అర్జంటుగా, సీక్రెటుగా రాత్రి ఫలానా చోటికి వచ్చి ఏభైలక్షలివ్వకపోతే నేను సూసైడు చేసుకు సచ్చిపోతా...

'సచ్చిపో...'

'నే సస్తే ఏవవుద్దో తెల్సా?'

'నువ్వు సచ్చి శవమవుతావు - ఇంకేవవుద్ది' అన్నాడు పెదసూరీడు తన జోకుకి తనే పగలబడి నవ్వుతూ.

'ఇంకేవవుద్దా? నీ ఎలెక్షనాగిపోద్ది'

'అమ్మో' అని పెదసూరీడు సోఫాలోంచి పైకెగిరి... మళ్ళీ ఫోనులో 'హలో' అనే లోపున ఫోను కట్టయింది.

నిమిషం తర్వాత చినసూరీడు కోటలో కూడా అలాగే ఫోను మోగింది.

ఆళ్ళు బెదిరిపోయి నా దగ్గరకి సలహాకి పరిగెట్టుకొచ్చారు.

అప్పుడు నేను రాజస్థాన్ గవర్నరుగా ఉండి, అక్కడ గవర్నమెంటు పడగొట్టి, ఆ తర్వాత పేపరోళ్ళ గోల ఎక్కువైతే రిజైన్ చేసి, ఇంట్లో రెస్టు తీసుకుంటున్నాను. రాత్రి ఇలాగే భోంచేసి వరండాలో పడకకుర్చీలో పడుకుని చుట్ట కాలుస్తున్నాను. చుట్ట కాలుస్తూ, కాలుస్తూ ఓ చిన్న కునుకు తీశాను కాబోలు - 'కొంప మునిగింది అప్పాజీ' అని పెద్ద కేక వినిపించి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. ఆ కేక వెనకాల పెదసూరీడు పరిగెట్టుకొచ్చి ఎదురుగా కుర్చీలో కూలబడి వగురుస్తూ, 'కొంప మునిగింది అప్పాజీ' అన్నాడు దీనంగా. ఆడికి ఏడుపు రావడమొకటే తరువాయి.

'ఏమైందిరా' అనడగబోతుంటే, 'కొంపలంటుకున్నాయి అప్పాజీ' అని మరోకేక వినిపించింది. చిన సూరీడు పరిగెట్టుకుంటూ వచ్చి నా ఎదురుగానే మరో కుర్చీలో కూలబడి, 'కొంపలంటుకున్నాయి అప్పాజీ' అన్నాడు ఏడుస్తూనే.

'కొంపలంటుకోలేదు - మునిగాయి' అన్నాడు పెద్దోడు.

ఆడిమాట ఇన్నాకగాని ఆడు అక్కడున్న సంగతి చిన్నోడు గమనించలేదు. ఆడికేసి తిరిగి, 'కొంపలు మునగలేదు - అంటుకున్నాయి' అన్నాడు చిన్నోడు.

'కాగడా పార్టీవోడివి - అంటించడం తప్ప మరేం తెల్సు' అన్నాడు పెద్దోడు హేళనగా.

'మరే - వానొచ్చిందనీ, వరదొచ్చిందనీ దేశాన్ని ముంచెయ్యడం మాత్రం మీకు తెల్సు'

'గ్రూపులెట్టి, పార్టీ అంటించి, సలిమంటలేసుకోడం తెల్సు'

'అసలు గ్రూపులెట్టడానికి మీ పార్టీలో డెమోక్రసీ ఉంటే గదా... చెంచాగాళ్లకి గ్రూపెట్టే చేవ ఎక్కణ్ణుంచొస్తుంది?'

'మాటలు మర్యాదగా రానీ - నాక్కోపం వచ్చిందంటే ఆడూ ఈడూ అని సూణ్ణు అప్పాజీ' అన్నాడు పెద్దోడు.

'ఢిల్లీవోళ్ళ సెప్పులు నెత్తి నెట్టుకు మోసే ఎదవలకి పౌరుషం, ఆత్మాభిమానం ఉంటాయా అప్పాజీ' అన్నాడు చిన్నోడు ఆశ్చర్యం నటిస్తూ.

ఆళ్ళిద్దర్నీ శాంతింపచేసి, 'ఆడెల్లాంటాడో, నువ్వెల్లాంటాడివో, మీ పార్టీలెల్లాంటివో, జనాలకి తెలీకపోయినా, రాజకీయాల్లో తలపండి ఎంట్రుకలూడినోణ్ణి - నాకు తెల్దా?' అసలు సంగతేంటో చెప్పండి. ఎవరి కొంపలంటుకున్నాయి, ఎవరి కొంపలు మునిగాయి' అనడిగాడు.

'అదేంటప్పాజీ అలా అంటారు' ఎవరికొంపలో అయితే మాకేంటి? మా కొంపలే' అన్నారు ఆళ్ళిద్దరూ ఆశ్చర్యపోయి.

విషయం చెప్పి, 'మాకేంచెయ్యడానికి పాలుబోటంలేదు అప్పాజీ' అన్నారు దీనంగా.

'కంగారు పడకండి - అణ్ణి మీటయి అసలు సంగతేంటో కనుక్కుందాం' అన్నాను ఇద్దర్నీ ఓదార్చి.

★★★

ఊరవతల బంగ్లా దగ్గరకి, ఆడు చెప్పినట్టుగానే సీక్రెటుగా చినసూరీడు, పెదసూరీడు, నేనూ వెళ్ళాం. బంగ్లా లోపల లైట్లు వెలుగుతున్నాయి. లోపలకెళ్లాలా వద్దా అని ఆలోచిస్తూ, తలుపు దగ్గర నిలబడ్డాం. మా అలికిడి వినిపించినట్లుంది - 'రండి, రండి - మీరొస్తారని నాకు తెల్సు - తలుపు తీసే ఉంచాను' అని లోపల్నుంచి వినిపించింది.

మేం లోపల హాల్లో అడుగుబెట్టేసరికి ఆడు అంతా రెడీ చేసుకుని ఉన్నాడు. సీలింగు ఫానుకి తాడు ముడేసి, రెండోకొస మెడకి తగిలించుకుని, కాళ్లకు ఇసకబస్తా కట్టుకుని, పెద్ద స్టూలెక్కి కూర్చున్నాడు. నన్ను చూడగానే ఆడు సంతోషంగా 'రండి అప్పాజీ' అని మర్యాద చేశాడు.

కుర్రాడు చాకులా ఉన్నాడు - ముప్పయి అయిదేళ్ళుంటాయేమో, ఆ గిరజాల జుట్టూ, ఆ చురుకైన కళ్లూ, మాటతీరూ - ఆడ్ని ఎక్కడో చూసినట్టనిపించింది. అది గుర్తుకు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ 'నేను నీకు ఎలా తెల్సు?' అనడిగాను.

'భారతంలో భీష్ముడిలాంటోరు - తవరు తెలియక పోవడవేంటి?' అన్నాడు వాడు నమస్కార బాణం వదులుతూ.

'నిన్నెక్కడో సూసినట్టుంది'

'నన్ను సూడలేదు - మా తాత మీ జెయిలుమేటు - నాది మా తాత పోలికే...' అణ్ణి ఎగాదిగా చూసి, 'నువ్వు

మిగతా 13వ పేజీలో

# గుండె గురించి మీకేం తెలుసు?

## గుండె జబ్బులు

మన శరీరానికి ప్రాణాధార అవయవం గుండె. అలాంటి గుండె గురించిన మెడికల్ పరిజ్ఞానం మీలో ఏపాటి ఉందో తెలుసుకోవటానికి ఒకసారి ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలను వెతకండి –

1. మనిషి గుండెలో ఎన్ని అరలుంటాయి?
ఎ) 3 బి) 4 సి) 5

2. గుండె మన శరీరంలో ఏ వేపున వుంటుంది?
ఎ) ఎడమ వైపున బి) కుడి వైపున

3. మనుషులను వేడి రక్తం కలవాళ్ళు (worm blooded)గా ఎందుకు పేర్కొంటారు?
ఎ) వాళ్ళకు త్వరగా కోపం వస్తుంది కాబట్టి బి) మనుషులకు మాత్రమే జ్వరాలు వస్తాయి కాబట్టి సి) వాతావరణపు ఉష్ణోగ్రతతో ఎన్ని మార్పులు వచ్చినా మనిషి టెంపరేచరు ఎప్పుడూ ఒకే రకంగా ఉంటుంది కాబట్టి

4. మనిషి గుండె నిమిషానికి ఎన్నిసార్లు కొట్టుకుంటుంది?
ఎ) 50సార్లు బి) 58సార్లు సి) 72సార్లు

5. మన కండరాలు:
ఎ) తమంతట తాము పనిచేస్తాయి (involuntary)
బి) మన అదుపాజ్ఞలలో పనిచేస్తాయి (voluntary)

6. మన గుండె ఈ కింది శరీర భాగం నుంచి వచ్చే విద్యుత్తరంగాల మూలంగా కొట్టుకుంటుంది.
ఎ) మెదడు బి) రక్తం సి) గుండె నుంచే

7. గుండె మన శరీరపు బరువులో 0.5 శాతం బరువు మాత్రమే ఉంటుంది. మరి అలాంటి గుండెకు ఎంత శాతపు రక్త సరఫరా అవసరమవుతుంది ?
ఎ) 5శాతం బి) 1శాతం సి) 0.5 శాతం డి) 2.5శాతం

8. గుండెపోటు కి మెడికల్ పర్యాయపదం ఏమిటి?
ఎ) CARDIAC FAILURE
బి) ANGINA
సి) MYOCARDIAL INFRACTION
డి) CARDIAC ASYSTOLE

9. గుండెపోటు (Heart Attack) వచ్చినప్పుడు వాస్తవానికి ఏం జరుగుతుంది?
ఎ) గుండె కండరాలకు వెళ్ళే రక్తం నిలిచిపోతుంది (block అయిపోతుంది)
బి) గుండె కొట్టుకోవటం ఆగిపోతుంది.
సి) గుండె కొట్టుకుంటుంది కాని రక్తం పంప్ చేయబడదు.
డి) మెదడు గుండె మీద అదుపును కోల్పోతుంది.

10) గుండెపోటు (Heart Attack) లక్షణాలు ఈ కింది వాటిలో దేనిలో కన్పిస్తాయి ?
ఎ) మైగ్రేన్ బి) యాంజినా సి) శ్వాస పడిపోవటం (Lung Attack) డి) వాంతులు

11. ఈ కింది వాటిలో ఏవి గుండెపోటు లక్షణాలు?
ఎ) తెమలటం (Nausia) బి) విపరీతమైన చెమటలు సి) ఛాతిలో తీవ్రమైన నొప్పి డి) కనుగుడ్లు తేలవేయటం ఇ) ఛాతీ బిగదీస్తున్నట్లుగా అనిపించటం ఎఫ్) శ్వాస కష్టం కావటం జి) తలనొప్పి హెచ్) పక్షవాతం

12. గుండె ఆరోగ్యం పాడుకావటానికి అనేక కారణాలు ఉంటాయి. వాటిలో ఈ కిందివి ఏమున్నాయి?
ఎ) తాగుడు బి) జాగింగ్ సి) స్థూలదేహం డి) యోగ ఇ) పొగతాగటం ఎఫ్) హైపర్ టెన్షన్ జి) కోపము, వర్రీ హెచ్) మెట్లెక్కడం

13. మీ ఎదురుగా ఎవరికన్నా గుండెపోటు వచ్చినప్పుడు ఈ కింది పనుల్ని మీరు ఏ వరసక్రమంలో చేస్తారు?
ఎ) అతని బంధువులకు కబురు చేస్తారు బి) అతడి బట్టలను వదులు చేస్తారు సి) డాక్టరు కోసం లేక అంబులెన్స్ కోసం తక్షణం మేసేజ్ పంపుతాను. డి) అతడిని ఏటవాలుగా (Semi Reaching Pisitionలో) పడుకోబెడతాను ఇ) తాజా గాలికోసం గది కిటికీ తలుపుల్ని తెరుస్తాను ఎఫ్) పేషెంటుకు ఓదార్పు వచనాలు చెబుతాను జి) CARDIO PULMONARY RESUSCITATION చేస్తాను

14. I.C.C.U. అంటే ఏమిటి?
ఎ) Intensive care And Central Unit
బి) Invasive Cardiac Care Unit
సి) Intensive Cornary Care Unit

15. కరొనరీ బైపాస్‌లో ఏంచేస్తారు?
ఎ) గుండెను బైపాస్ (By pass) చేస్తారు బి) గుండెకు నిలిచిపోయిన రక్త సరఫరాని By pass చేస్తారు సి) పాత గుండె అరను By pass చేస్తూ కొత్త గుండె అరను ఏర్పరుస్తారు

16. పేస్ మేకర్ అంటే ఏమిటి?
ఎ) అది జీవితపు నడకను (paceని) నిర్ణయిస్తుంది బి) గండె కొట్టుకోవటాన్ని ఏర్పరచి (Generate చేసి) దాని క్రమబద్ధీకరించే ఒక పరికరం సి) పేషెంటు మీద పడే వొత్తిడిని తట్టుకునే విధంగా అతడి గుండెను కొట్టుకునేట్లు చేస్తుంది.

17. ECG పూర్తి పదాలు ఏమిటి?
ఎ) Existing Cardiac Grading
బి) Electric Cardiac Generator
సి) Electro Cardio Grown

18. ట్రెడ్ మిల్ టెస్ట్ (Tread Link Test) కు కింది వాటిలో దేనిని తెలుసుకోవటానికి ఉపకరిస్తుంది?
ఎ) గుండె సామర్థ్యాన్ని తెలుసుకోవటానికి బి) మెదడు, గుండె సామర్థ్యాన్ని తెలుసుకోవటానికి సి) ఊపిరితిత్తులు, గుండె సామర్థ్యాన్ని తెలుసుకోవటానికి

19. గుండెలో రంధ్రం పడటం అంటారు. అది ఈ కింది వాటిలో దేనిని సూచిస్తుంది?
ఎ) గుండె వెలుపలి గోడలో రంధ్రాన్ని బి) గుండె రెండు అరల మధ్య రంధ్రం పడడాన్ని సి) గుండె పొడుగుతా రంధ్రం పడడాన్ని

20. గుండెపోటు వచ్చాక రతి కార్యం సాధ్య పడు తుందా?
ఎ) సాధ్యంకాదు బి) రెండు వారాల కొకసారి పాల్గొనవచ్చు సి) స్త్రీ పైన ఉండే పద్ధతిని మాత్రం పాటించవచ్చు డి) ఇంతకు మునుపులాగే పాల్గొనవచ్చును. కాని కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

సమధానాలు:

1. బి

2. (ఎ) గుండె మన ఛాతికి మధ్యభాగంలో కొద్దిగా ఎడమవైపున ఉంటుంది. పుట్టుకతో వచ్చే లోపం (DEXTROCARIA అంటారు దీనిని) మూలంగా కొన్ని అసాధారణ పరిస్థితులలో గుండె కుడివైపున కూడా ఉండవచ్చు.

3. (సి) చల్లటి రక్తపు (cold blooded) జారి కింది కప్పను చెప్పవచ్చు.

4. (సి) రాత్రులు మాత్రం సుమారున నిమిషానికి 55సార్లు కొట్టుకుంటుంది.

5 (ఎ) వాటి మీద మన కంట్రోల్ అంటూ ఏమీలేదు.

6. (సి) ECG లో నమోదు అయేవి గుండె తాలూకు ఈ విద్యుత్తరంగాలే.

7. (ఎ)

8. (సి)

9. (ఎ)

10. (బి) గుండెపోటు సందర్భంలో గుండెలోని ఒక భాగానికి వెళ్ళే రక్త సరఫరా నిలిచిపోతుంది. ANGINA సందర్భంలో అలా కాదు. రక్త సరఫరా తాత్కాలికంగా మాత్రమే నిలిచిపోయి గుండెలో కారణమవుతుంది. తర్వాత నొప్పి తగ్గిపోతుంది కూడా.

11 (ఎ), (బి), (సి), (ఇ), ఎఫ్ (ఎఫ్)

12. (ఎ), (సి), (ఇ), (ఎఫ్), (జి) మిగతా మూడు, అంటే (బి), (డి), (హెచ్) గుండె ఆరోగ్యానికి మంచిది.

13. (సి), (డి), (బి), (ఇ), (ఎఫ్), (ఎ) నాడి కొట్టుకోకపోతే మాత్రం (జి) కూడా చేస్తారు.

14. (సి)

15. (బి)

16. (బి)

17. (సి)

18. (ఎ)

19. (బి)

20. (డి) గుండెపోటు వచ్చాక తక్కువలో తక్కువ 6 నుంచి 8 వారాలపాటు ఆగి ఆ తర్వాత మరలా రతిలో పాల్గొనవచ్చును. అయితే ముందుగా ఒకసారి డాక్టరు చేత పరీక్ష చేయించుకొనుట మంచిది.

**– డా. సి. యల్. వెంకటరావు**

# లైంగిక శక్తిని వృద్ధిచేసే పిల్లి తేగలు


## మందుమొక్క

పిల్లి తేగలు, చల్ల గడ్డలు లేక పిల్లి పీచర గడ్డలు అనే ఈ మొక్కను సంస్కృతంలో 'శతావరి' అంటారు. దీన్ని శాస్త్రీయంగా 'ఆస్పరాగస్ రెసిమోసస్' అని పిలుస్తారు. దీనిలో చాలా రకాలయిన జాతులున్నాయి. రెసిమోసస్ జాతి మొక్క మనకు ఎక్కువగా దొరుకుతుంది. ఈ మొక్క 'లిలియేసి' అనే కుటుంబానికి చెందినది.

ఇది ముళ్ళు కలిగిన ఎగబాకే తీగ్గె. ఆకురాలే అడవుల్లో చెట్ల మొదళ్లను పట్టుకొని అల్లుకుంటూపోతుంది. ఈ తీగ వేర్లు నిలువ చేసుకొని, దుంపలుగా మారి, సుమారు అర్ధమీటరు వరకు పెరిగి, ఒక మొక్క నుంచి 10 నుంచి 50కి పైగా గుత్తులుగా ఏర్పడుతాయి. పత్రాలకు బదులుగా చిన్నచిన్న కొమ్మలు, సూదుల్లాగా ఏర్పడుతాయి. ఇవి ఆకుపచ్చగా వుండి, ఆహారాన్ని తయారు చేసుకుంటాయి. పుష్పాలు తెల్లగా అతిచిన్నవి, పొడవాటి గుత్తులుగా వస్తాయి. ఫలాలు గుండ్రంగా వుండి, పండినపుడు ఎర్రగా వుంటాయి. బాగా పెరిగిన మొక్క అందంగా వుంటుంది.

ఈ దుంప వేర్లయందు 'సరసపోజెనిన్' అనే ఔషధోపయుక్తమైన పదార్థముంది. పిండి పదార్థంతో పాటు, ఎక్కువ మోతాదులో 'చక్కెర', జిగురు వుంది. ఆయుర్వేధంలో దీని వేరుకు మధుర రసగుణము, మధుర విపాక, శీత – వీర్య లక్షణాలున్నట్లు చెప్పబడినది. వేరులోనున్న 'సరసపోజెనిన్' లో 'ఈస్ట్రోజెనిక్' ప్రభావం చూపే పదార్థాలున్నాయని కనుగొన్నారు. ఈ పరిశోధనలకు ముందే, దేశీయ వైద్యంలో ఈ వేర్లను, లైంగిక వృద్ధికి, లైంగిక శక్తి కోల్పోయిన వారికి, శక్తి కలిగించడానికి అమోఘమైన ఔషధంగా వాడుతున్నారు. ఆయుర్వేధ ఔషధమైన 'శతావరిగృతము', లైంగిక వృద్ధి కలిగించే టానిక్. పిల్లి తీగల వేర్లు దంచి రసం తీసి, దాన్లో పాలు, నెయ్యి, చక్కెర, తేనె, పిప్పళ్ళా యోడి మొదలుగునవి కలిపి చేసే ఈ ఔషధం – వయసుకు రాని పిల్లలకిస్తే, త్వరగా వయసుకు వస్తారని అంటారు. తరచుగా గర్భస్రావమయే స్త్రీలకు, గర్భం నిలుస్తుంది. వేరుపొడి చేసి ఇస్తే తెల్లబట్ట, ఎర్రబట్ట వ్యాధి తగ్గుతుందని గిరిజన వైద్యం అనుభవం. పాలిచ్చే తల్లులకు, వేరు కషాయం ఇస్తే, క్షీరవృద్ధి కలుగుతుంది. పిల్లితేగల వేర్లు, పాలు, వెన్న అరణ్యాలలో దొరికే వివిధ మూలికలు కలిపి తయారుచేసే 'ఫలగృత' అనే లేహ్యం లాంటి ఔషధము వీర్యవృద్ధి, సంతానఫలం కలిగించడమే గాక, స్త్రీల లైంగిక వ్యాధులను పోగొడ్తుందని దేశీయవైద్యం చెబుతోంది. ఈ వేర్ల నుపయోగించి తయారుచేసే ఆయుర్వేద ఔషధనూనె అయిన 'నారాయణ తైలం' కీళ్ళవాతం, మెడనొప్పులు, రుమాటిజమ్, నరాల సంబంధ వ్యాధులు తగ్గించడానికి పైపూతగా వాడుతారు. ఇదేగాక 'విష్ణు తైలం' అనే పైపూత నూనె కూడా పిల్లి తేగల వేర్లనుంచే తయారుచేస్తారు. గనేరియా మరియు మూత్రసంబంధమైన వ్యాధులకు పైపూతగా వాడే 'ప్రమేహ మిహిర తైలం' ఈ వేర్లనుపయోగించి తయారు చేస్తారు.

దీర్ఘ కాలంగా వున్న కడుపునొప్పి, విరేచనాలకు పిల్లి తేగల వేర్లు పొడిచేసి ఇస్తే మంచిది. దీని వేర్లను, పల్లేరు మొక్కలతో కలిపి, ఎండించి,



కషాయం కాచి ఇస్తే మూత్ర పిండాలలోని, మూత్రాశయంలోని రాళ్లు కరిగిపోతాయి (దేశీయ వైద్యం). వేర్లను పొడిచేసి, చక్కెర పాకంలో కలిపి, హల్వాలాగా చేసి పిల్లలకు, వృద్ధులకు రోజూ ఉసిరిక్కాయంత ఇస్తే, శక్తి కలుగుతుంది. మంచి టానిక్‌లాగా పనిచేస్తుంది.

తెల్లబట్ట వ్యాధి తగ్గడానికి ఈ వేర్లతో పాటు, మంచగంధం పొడి కలిపి దంచి కషాయం కాచి రోజూ రెండు లేక మూడు చెంచాలు మూడు పూటలా తగ్గేంత వరకు తీసుకోవాలని చిత్తూరు జిల్లా యానాదులన్నారు. ఈ మొక్క నుంచి అనేక హైబ్రిడ్లు అభివృద్ధి చేసి అలంకరణ కోసరం, తోటల్లో పెంచుతున్నారు. పై లక్షణాలన్ని అరణ్యాల్లో సహజంగా పెరిగే మొక్కలకు మాత్రమే వున్నాయి. ఔషధోపయుక్తమైన పదార్థమైన 'సరసపోజినిన్' సహజంగా పెరిగే అడవి మొక్కలలోనే సమృద్ధిగా వుంటుంది. వాటిని ఉపయోగిస్తేనే పైగుణాలు కనబడుతాయి.

**– డా. యస్. వేదవతి**

# మాయ

12వ పేజీ తరువాయి

జేజిగాడి మనవడివా?' అన్నాను ఆశ్చర్యంగా.

సత్యాగ్రహం చేసి జెయిలు కెళ్లినప్పుడు మా పనులు చేసి పెట్టడానికి ఖైదీలని పంపించేవారు జెయిలు అధికారులు. జేబుదొంగ జగన్నాధం – ఆణ్ణి మేమంతా జేజిగాడనేవాళ్ళం – అలా పరిచయమయ్యాడు. ఆడి మనవడన్నమాట ఈడు.

'ఫామిలీ లైనొదిలేసి పొలిటిక్సులోకి దిగేవేంట్రా మనవడా!' అన్నాను పరిహాసంగా.

'ఆళ్లలైనా, మనలైనా కలిసేచోట కొద్దిగా బిజినెస్ చేద్దామని దిగాను కాని ఫామీలీ లైనొదల్లేదు...'

'సంగతేంటో చెప్పు' అన్నాను అసలు విషయంలోకి వస్తూ.

'ఈళ్ళు చెప్పలేదా? చెరో ఏభై లక్షలు ఇవ్వకపోతే నేను సూసైడు చేసుకుంటానని చెప్పానే...చెప్పానా లేదా?'

'చెప్పావు...చెప్పావు' అన్నారు సూరీళ్ళిద్దరూ కంగారుగా.

'ఆ శ్రమ నీకెందుకు మనవడా? నిన్నిప్పుడు మర్డరు చేసి ఎలెక్షనయ్యేదాకా శవం బయటపడకుండా చేస్తే....'

'ఆ పప్పులుడకవు'

'ఏం?'

'నేను అయిదేసి నిమిషాలకోసారి ఫోన్జేసి బతికున్నానని చెప్పకపోతే అవతల నా కొడుకు... అరే.... అయిదు నిమిషాలైపోయింది.... ఫోన్జెయ్యలేదే' అంటూ స్టూలు మీద పక్కన పెట్టుకున్న ఫోనెత్తి, 'ఒరే తాతా! నేను బతికే ఉన్నానురోయ్, అప్పాజీ వచ్చేశారు – ఏంటీ నీకు తెలుసా – ఫోటోలు తీశావా – అమ్మనాకొడుకోయ్...' అని మురిసిపోతూ ఫోను పెట్టేసి, 'నా కొడుక్కి మా తాత పేరెట్టుకున్నాను. అందుకని ఆణ్ణి తాతా అని పిలుస్తాను. ఆడు మొన్న షిప్పులో దిగిన జపానోళ్ళ దగ్గర కెమెరా కొట్టేశాడు. దాంతో చీకట్లో కూడా ఫోటోలొస్తాయంట – మీరు రావడం ఆడు టెలీలెన్సుతో కూడా తీశాడుట...

అప్పాజీ! మీరు నాకో చిన్న హెల్ప్ చెయ్యాలి. మావోణ్ని అమెరికా పంపించి అక్కడ మాఫియా అండరులో ట్రెయినింగిప్పించి ఆణ్ణి కేడీని చెయ్యాలనుంది – అదంతా తర్వాత చూద్దాం కాని.... ఇంతకీ చెప్పేదేంటంటే, అయిదేసి నిమిషాలకోసారి నేను బతికున్నానని ఫోను చెయ్యకపోతే వెంటనే పోలీసు రిపోర్టు ఇచ్చేస్తాడు. నన్ను మీరు సంపేసారని నేను రాసిన ఉత్తరం, ఫోటోలతో సహా రేపు పేపర్లలో వచ్చేస్తుంది...



'కుర్రాడివి – నూరేళ్ళు బతకాల్సినాడివి – పేపర్లలో నీ ఉత్తరం, ఫోటోలు వస్తే కొంపలంటుకుంటాయనకున్నావా? వేల కేసుల్లాగే ఎల్లుండికి జనం మర్చిపోతారు. నువ్వు సస్తే కాలవాగిపోతుందా? ఎలెక్షను కౌంటరు మాండవుతుంది. రెండు మూడు నెలల్లో మళ్లీ ఎలెక్షన్లు జరుగుతాయి కాని నిలబడ్డానికి నువ్వుండవు... ఎందుకొచ్చిన గొడవ ఇదంతా....'

'ఆ మాట ఆళ్లననమండి – ఇప్పుడే సచ్చిపోతా' అన్నాడు ఆడు ఇసకబస్తా కొంచెం ముందుకు జరిపి.

'కౌంటరు మాండేంటీ?' అన్నాడు పెద్దాడు.

'ఏంలేదు – ఈడు కూడా కేండిడేట్ గనక ఈడు సచ్చిపోతే ఎలెక్షను రద్దయి...'

'అమ్మోయ్! ఎంతకర్సు... ఎంత శ్రమ... ఎంత సస్పెన్సు... కోట్లకి కోట్లవుద్ది... అదీగాక మా గ్రూపుల్లో ఉన్న నా కొడుకులు ప్లేటు పిరాయించి బాంబుల బుచ్చిరెడ్డితో చేరిపోతే? ఇద్దరం మునిగిపోతే... వద్దు అప్పాజీ... ఆడితోనే సెటిల్ చేసేయండి....' అని ఇద్దరూ అభిప్రాయ బేధాలు లేకుండా గొల్లుమన్నారు.

'ఇయన్నీ ముందాలోచించి చీఫ్ మినిస్ట్రు కేండిడేట్లు, ప్రైమినిస్టరు కేండిడేట్లు రెండుమూడుచోట్ల పోటీ చేస్తారు. మీరు బుద్ధి తక్కువగా...'

'...లెంపలేసుకుంటున్నాం అప్పాజీ! ఈడితోనే సెటిలు చేసేయండి...'

'స్టూలు దిగమంటారా!' – అన్నాడు జేజిగాడి మనవడు.

అప్పాజీ అదంతా గుర్తుకొచ్చి పగలబడి నవ్వాడు.

'ఇంతకీ ఎవరు నెగ్గారు?'

'పెద సూరీడు – ఆడు చీఫ్ మినిష్టరయ్యాడు, చినసూరీడు ఆడిపార్టీలో కల్సిపోయి డిప్యూటీ చీఫ్ మినిష్టరయ్యాడు. ఇద్దరూ దేశాన్ని సున్నుండలూ, పూతరేకు సుట్టలూ తిన్నట్టు అయిదేళ్ళు సుభ్రంగా తినేశారు...'

'అప్పాజీ' – శ్రోతల్లో ఓ కుర్రాడు కొంచెం సిగ్గుపడుతూ లేచాడు. 'ఆడు, ఈడు బాంబుల బుచ్చిరెడ్డి – అంతా ఒకటే అయితే, ఇన్ని పార్టీలేంటీ జనాలు అటూ ఇటూ ఓట్లెయ్యడం ఏంటి?' – బుర్ర గోక్కుంటూ అడిగాడు.

అరుగుమీద డేంజరు లైటు భూకంపం వచ్చినట్లు పైకీ కిందకూ ఊగి ఊగి కిందికి జారింది. జలుబు చేసిన ముసలిగొర్రె దగ్గినట్లు ఆగకుండా దగ్గు వినిపించింది.....

'అప్పాజీ – సలిగా ఉంది – లోపలికి పదండి' అభిమానంగా బలవంతం చేశారు శిష్యులు. ★

వచ్చేవారం కథ

**మాయ రాంతెరు**

**– డాక్టర్ వి. చంద్రశేఖర రావు**